జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ, డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com

www.jatheeyavaartha.com

# జాతీయ వార్త

తెలుగు దిన పత్రిక



చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com



శుక్రవారం | 18-09-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 786 పేజీలు: 4 వెల : రూ.7





నోరుందని కేకలు వేస్తే.. అబద్ధాలు..

# నిజమైపోవు!

- ఫేక్ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు ఇస్తారా?
- చిత్తశుద్ధి ఉంటే డీఎస్సీపై చర్చకు రావాలి
- 22న మేం రెడీ
- లేదు.. మీరు వేదిక చెప్పినా మేం వస్తాం
- ఆధారాలతో మేం వస్తాం
- తక్షణం సీబీఐ విచారణ వేయాలి
- ఇంటర్‌లో ఎన్ని సబ్జెక్టులుంటాయో తెలుసా
- వైసీపీ ఆమదాలవలస సమన్వయకర్త చింతాడ రవికుమార్
- ఎమ్మెల్యే కూన రవికుమార్‌కు చింతాడ సవాల్

శ్రీకాకుళం, సెప్టెంబర్ 17 (వార్త): ఫేక్ సర్టిఫికెట్లతో రాష్ట్రంలో 3.40 లక్షల మంది నిరుద్యోగుల జీవితాలతో కూన రవికుమార్ ఆడుకోవడం సరికాదని, చిత్తశుద్ధి ఉంటే డీఎస్సీపై చర్చకు రావాలని వైసీపీ ఆమదాలవలస సమన్వయకర్త చింతాడ రవికుమార్ ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్‌కు సవాల్ విసిరారు. గురువారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. చేసేవన్ని దొంగపనులు, వాటిని కప్పిపుచ్చుకోవడానికి నోరుంది కదా అని పెద్ద పెద్ద కేకలు వేసి అరిస్తే అబద్ధాలు నిజమైపోవన్నారు. జీవో నెంబర్ 47లో ఏ లోపాలు లేకుంటే మా నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి ప్రశ్నించిన వెంటనే మరో జీవో 56ని ఎందుకు ఇచ్చారో చెప్పాలని ప్రశ్నించారు. నిరుద్యోగులపై చిత్తశుద్ధి ఉంటే ఆధారాలతో సహా బహిరంగ చర్చకు ఈ నెల 22న ఆమదాలవలస వైఎస్సార్ విగ్రహం వద్దకు రావాలని, లేదా మీరు వేదిక చెబితే ఆధారాలతో నేను వస్తానని సవాల్ విసిరారు. ఫామ్-2లో స్పోర్ట్స్‌కు సంబంధించి సాఫ్ట్‌బాల్ కార్యదర్శి సంతకాలుంటేనే అర్హులుగా భావిస్తామని చెబితే అధ్యక్షులుగా ఉన్న కూన రవికుమార్ సంతకాలు ఎలా చెల్లుబాటవుతాయని మండిపడ్డారు. కేవలం నాలుగు మాత్రమే తాను సంతకాలుపెట్టి ఇచ్చానని కూన చెప్పడం దారుణమన్నారు. మొత్తం 37మందికి సాఫ్ట్‌బాల్ సర్టిఫికెట్లతో ఉద్యోగాలిస్తే అందులో తన దగ్గరే 25 మందికి కూన రవి సంతకాలతో ఉన్నాయని, ఇంకా మిగిలినవి ఉద్యోగాలు రానివి దరఖాస్తు చేసుకున్నవారు ఇంకెంతమంది ఉన్నారో, ఎంతమంది దగ్గర ఎన్ని లక్షలు దోచుకున్నారో తెలియదన్నారు. స్పోర్ట్స్ కోటాలో 2025 మే 31 చివరి తేదీగా దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఇచ్చారని, అయితే 2025 జూలై 16న జారీచేసిన సర్టిఫికెట్లు ఎలా చెల్లుబాటు అవుతాయో చెప్పాలన్నారు. ఫేక్ సర్టిఫికెట్‌తో ఉద్యోగం పొందిన షేక్‌సబ్బీర్, అశోక్‌కుమార్‌లకు ఎలా ఉద్యోగాలు వచ్చాయో చెప్పాలన్నారు. నిరుద్యోగులపై చిత్తశుద్ధి ఉంటే తక్షణమే సీబీఐ దర్యాప్తు చేయించాలని డిమాండ్ చేశారు. ఇంటర్‌లో మ్యాథ్స్ వారికి 10 సబ్జెక్టులుంటాయని అనడం దారుణమని, కనీసం ఎన్ని సబ్జెక్టులుంటాయో తెలియని మీరు చదువుకోసం మాట్లాడం సిగ్గుచేటన్నారు. చూసిరాసి పాసైతే ఏయే గ్రూపులకు ఎన్ని సబ్జెక్టులుంటాయో ఎలా తెలుస్తుందన్నారు. గ్లోబల్‌కి.. గోబెల్‌కి తేడా తెలియని కూన తమ నాయకుడి కోసం మాట్లాడటం తగదన్నారు. సమావేశంలో వైసీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బొడ్డేపల్లి రమేష్‌కుమార్, సరుబుజ్జిలి మండల అధ్యక్షుడు బెరవ మల్లేశ్వరరావు, కోరాడ రమణమూర్తి, పొడుగు శ్రీనివాసరావు, చింతాడ ప్రసాదరావు, ఈశ్వరరావు, సురవరపు నాగేశ్వరరావు, చిన్నారావు, తిరుపతిరావు పాల్గొన్నారు.

# అంబేడ్కర్‌ను కించపరుస్తారా?

- హమారా ప్రసాద్‌పై చర్యలు తీసుకోవాలి
- దేశద్రోహం కేసు నమోదు చేయాలి
- ఆయన రాసిన పుస్తకాన్ని నిషేధించాలి
- పోలీసులకు ఫిర్యాదు చేసినా కేసులు నమోదు చేయకపోవడం దారుణం
- దళిత ప్రజాసంఘాల నాయకులు
- శ్రీకాకుళంలో దళిత ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో భారీ నిరసన



శ్రీకాకుళం, సెప్టెంబర్ 17 (వార్త): డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్‌పై హమారా ప్రసాద్ చేస్తున్నట్లు ఆరోపిస్తున్న అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ దళిత ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో గురువారం ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ జంక్షన్‌లో అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించిన అనంతరం డే అండ్ నైట్ జంక్షన్ వరకు నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా అంబేద్కర్‌ను అవమానించే వ్యాఖ్యలను ఖండిస్తూ నినాదాలు చేశారు. 'కల్పితనాయకుడు' పుస్తకాన్ని నిషేధించాలని, హమారా ప్రసాద్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని నాయకులు డిమాండ్ చేశారు. అంబేద్కర్‌పై చేసిన వ్యాఖ్యలపై కఠిన చర్యలు తీసుకోవాలని, దేశద్రోహం కేసు నమోదు చేసి శిక్షించాలన్నారు. రాజ్యాంగ రూపకల్పనలో అంబేద్కర్ పాత్రను, సామాజిక న్యాయం కోసం ఆయన చేసిన కృషిని నాయకులు ఈ సందర్భంగా గుర్తుచేశారు. సమాజంలో ఉద్రిక్తతలకు దారితీసే వ్యాఖ్యలకు అడ్డుకట్ట వేయాలని కోరారు. ప్రపంచ మేధావి, నవభారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో పోలీసులకు ఫిర్యాదులు చేసినప్పటికీ కేసులు నమోదు చేయకపోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు. అంబేద్కర్‌పై వ్యాఖ్యల విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే స్పందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా దళిత ప్రజాసంఘాల ఐక్యవేదిక నాయకులు పేడాడ కృష్ణారావు, బొకర నారాయణరావు, మిస్కా కృష్ణయ్య, రాయి వేణుగోపాల్, దుర్గాసి గణేష్, కంఠ వేణు, తైక్వాండో శ్రీను, యడ్ల గోపి, బి. మురళీకృష్ణ, చలపతిరావు, ముక్కు ఆదినారాయణ, నటుకుల మోహనరావు, పోతుల దుర్గారావు, బోనెల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.





## 18.415 కిలోల గంజాయి స్వాధీనం

పలాస, సెప్టెంబర్17 (వార్త): గంజాయిని రవాణా చేస్తున్న ఇద్దరిని కాశీబుగ్గ పోలీసులు అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి 18.415 కిలోల గంజాయి, రెండు సెల్ ఫోన్లు, రూ.1,760 నగదును స్వాధీనం చేసుకున్నట్లు కాశీబుగ్గ సీఐ జి.రామ కృష్ణ తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు గురువారం మధ్యాహ్నం 3.15 గంటలకు పలాస రైల్వే కాలనీ 3వ లైన్ జంక్షన్ వద్ద పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఈ సమ యంలో రెండు బ్యాగులతో పలాస రైల్వే స్టేషన్ వైపు వెళ్తున్న మునా బరదన్, సంజనా కర్జీలను అదుపులోకి తీసుకుని తనిఖీ చేయ గా, తొమ్మిది ప్యాకెట్లలో సుమారు 18.415 కిలోల గంజా యి గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. వీరిద్దరూ ఒడిశా రాష్ట్రానికి చెందినవారని, కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నారన్నారు. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించుకునేందకు ఈ మార్గాన్ని ఎన్నుకున్నారన్నారు. పదంపూర్ నుంచి పర్లాకిమిడి మీదుగా కాశీబుగ్గ చేరుకుని, అక్కడి నుంచి పలాస రైల్వే స్టేషన్ వైపు వెళ్తుండగా పోలీసులకు పట్టుబడ్డారని సీఐ తెలిపారు.

## గణేష్ మండపాల వద్ద డీఎస్పీ తనిఖీలు

వినాయక నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పా టు చేసిన గణేష్ మండపాలను డీఎస్పీ టి.భవాని గురువారం తనిఖీ చేశారు. మండపాల వద్ద భద్రతా ఏర్పాట్లు, విద్యుత్ సదుపాయాలు, రాకపోకల క్రమ బద్ధీకరణ తదితర అంశాలను పరిశీలించారు. ఉత్సవాలు ప్రశాంత వాతావర ణంలో జరిగేలా నిర్వాహకులు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. మండపాల వద్దకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగ కుండా రాకపోకలను క్రమబద్ధీకరించాలని తెలిపారు. రహదారులను ఆక్రమించేలా మండపాలు ఏర్పాటు చేయరాదని, అగ్నిమాపక, 108 తదితర అత్యవసర వాహనాలు రాకపోకలు సాగించేందుకు మార్గం అందుబాటులో ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. విద్యుత్ వైరింగ్, లైటింగ్ ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ప్రమాదాలకు తావులేకుండా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. డీజేలు.. అధిక శబ్దంపై నిఘా ఏర్పాటు చేశామని, మండపాల వద్ద అనుమతి లేని సౌండ్ సిస్టమ్‌లు, అధిక శబ్దంతో డీజేలు విని యోగించకుండా నిబంధనలు పాటించాలని నిర్వాహకులను డీఎస్పీ ఆదేశిం చారు. రాత్రి వేళల్లో మండపాల వద్ద భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని, అను మానాస్పద వ్యక్తులు లేదా వస్తువులు కనిపించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.నిమజ్జనంపై ప్రత్యేక దృష్టి సాహరించడం జరిగిందని, వినాయక విగ్రహాల నిమజ్జనం సందర్భంగా పోలీసుల సూచనలు తప్పనిసరిగా పాటించాలని డీఎస్పీ భవాని తెలిపారు. నిర్ణయించిన మార్గాల్లోనే ఊరేగింపులు నిర్వహించాలని, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా సహకరించాలని కోరారు.

జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# స్థానిక ఎన్నికల్లో అభ్యర్థులను బరిలో నిలపాలి

## ఎచ్చెర్లలో జరిగిన కాంగ్రెస్ విస్తృత స్థాయి సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు పిలుపు

- స్థానిక ఎన్నికలకు గ్రామ, మండల స్థాయిలో పార్టీ శ్రేణుల సన్నద్ధతపై చర్చ
- కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచన
- నూతనంగా నియమితులైన పార్టీ బాధ్యులకు నియామక ధ్రువపత్రాల అందజేత



**రణస్థలం, సెప్టెంబరు 17 (వార్త):** ఎచ్చెర్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశం గురువారం రణస్థలంలో నిర్వహించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులను సన్నద్ధం చేయడం, గ్రామ, మండల స్థాయిలో అనుసరించాల్సిన విధివిధానాలపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. ఎచ్చెర్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కంటెస్టెడ్ క్యాండిడేట్ కరిమజ్జి మల్లేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశానికి శ్రీకాకుళం జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు సనపల అన్నాజీరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షుడు మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలని సూచించారు. ప్రతి గ్రామం, ప్రతి మండలం నుంచి కాంగ్రెస్ పార్టీ తరఫున అభ్యర్థులు పోటీలో ఉండేలా స్థానిక నాయకులు సమన్వయంతో చర్యలు చేపట్టాలని తెలిపారు. పార్టీ అభ్యర్థులకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తూ ఎన్నికల ప్రక్రియలో చురుకైన పాత్ర పోషించాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. కాంగ్రెస్ భావజాలంపై విశ్వాసం ఉన్నవారిని పార్టీలోకి ఆహ్వానించి పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేయాలని ఆయన సూచించారు. ఎన్నికల సమయంలో కార్యకర్తల మధ్య సమన్వయం, ప్రజలతో నిరంతర సంబంధాలు కొనసాగించడం ద్వారా పార్టీ కార్యక్రమాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని పేర్కొన్నారు. ఎచ్చెర్ల నియోజకవర్గ కంటెస్టెడ్ క్యాండిడేట్ కరిమజ్జి మల్లేశ్వరరావు మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ శ్రేణులంతా ఐక్యంగా పనిచేయాలని కోరారు. గ్రామ, మండల స్థాయి నుంచి నియోజకవర్గ స్థాయి వరకు పార్టీ కార్యకలాపాలను సమన్వయంతో నిర్వహించి పార్టీ సంస్థాగత బలోపేతానికి కృషి చేయాలని తెలిపారు. సమావేశం సందర్భంగా జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు సనపల అన్నాజీరావు పార్టీ జిల్లా ఎగ్జిక్యూటివ్ బాడీలో వైస్ ప్రెసిడెంట్లు, సెక్రటరీలుగా నియమితులైన పలువురికి, అలాగే ఎచ్చెర్ల నియోజకవర్గంలోని నాలుగు మండలాల అధ్యక్షులకు నియామక ధ్రువపత్రాలను అందజేశారు. ఎచ్చెర్ల మండల అధ్యక్షుడిగా బొడ్డేపల్లి సీతారామయ్య, రణస్థలం మండల అధ్యక్షుడిగా కొత్తకోట్ల జోగినాయుడు, లావేరు మండల అధ్యక్షుడిగా నేతల ఆదినారాయణ, జి.సిగడం మండల అధ్యక్షుడిగా తాండ్రోతు గణపతిరావు నియమితులయ్యారు. కార్యక్రమంలో ఎచ్చెర్ల నియోజకవర్గ కోఆర్డినేటర్ ఆబోతుల వెంకట నాయుడు, మాజీ డీసీసీ ఉపాధ్యక్షుడు ఇజ్జురోతు రమణ, జిల్లా ఓబీసీ సెల్ చైర్మన్ పిన్నింటి పారన్నాయుడు, లావేరు మండల ఉపాధ్యక్షుడు అలపాన సీతయ్యారెడ్డి, లింగం శ్రీనివాస్, మహంతి అప్పలనాయుడు, పిన్నింటి ఆదినారాయణ, ఎస్.సింహాచలం తదితరులు పాల్గొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులు ఏ విధంగా సిద్ధం కావాలనే అంశాలపై నాయకులు, కార్యకర్తలు చర్చించారు.

## చీడిపూడిలో విద్యార్థులకు వైద్య పరీక్షలు



**సారవకోట, సెప్టెంబరు 17 (వార్త):** చీడిపూడి గ్రామ సచివాలయంలో గురువారం హోమియో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ప్రభుత్వ హోమియో వైద్యుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరానికి స్థానికులు, పాఠశాల విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రభుత్వ హోమియో వైద్యురాలు అనుజ్ఞ మాట్లాడుతూ హోమియో వైద్య విధానంతో పలు దీర్ఘకాలిక వ్యాధులకు చికిత్స అందించవచ్చని తెలిపారు. ఆరోగ్య సమస్యలు ఉన్నవారు నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించి తగిన చికిత్స పొందాలని సూచించారు. శిబిరంలో పాల్గొన్న రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి వారి ఆరోగ్య పరిస్థితిని పరిశీలించారు. వైద్యుల సూచనల మేరకు అవసరమైన వారికి హోమియో మందులను ఉచితంగా అందజేశారు. మందుల వినియోగం, ఆరోగ్య పరిరక్షణకు సంబంధించిన సూచనలు కూడా ఇచ్చారు. అదేవిధంగా చీడిపూడి గ్రామంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు కూడా వైద్య పరీక్షలు నిర్వహించారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని పరిశీలించి అవసరమైన సూచనలు చేశారు. గ్రామస్థులకు వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

## చెల్లయ్యవలసలో ఎస్సై పల్లెనిద్ర



**పోలాకి, సెప్టెంబరు 17 (వార్త):** జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర్‌రెడ్డి ఆదేశాల మేరకు చెల్లయ్యవలసలో బుధవారం రాత్రి ఎస్సై జి.రంజిత్ పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక ప్రజలతో నేరుగా మాట్లాడి గ్రామంలో నెలకొన్న పరిస్థితులు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో గ్రామంలో ప్రజలు ఐకమత్యంతో వ్యవహరించాలని ఎస్సై సూచించారు. ఎన్నికల సమయంలో రాజకీయ విభేదాలు వ్యక్తిగత ఘర్షణలకు దారితీయకుండా ప్రతి ఒక్కరూ సంయమనం పాటించాలని కోరారు. ఎటువంటి తగాదాలు, ఘర్షణలకు పాల్పడకుండా శాంతియుత వాతావరణాన్ని కొనసాగించాలని సూచించారు. గ్రామంలో ఏవైనా సమస్యలు తలెత్తినా, వివాదాలు ఏర్పడే పరిస్థితి ఉన్నా ముందుగా పోలీసుల దృష్టికి తీసుకురావాలని ఎస్సై రంజిత్ తెలిపారు. సమస్యలను చట్టపరమైన మార్గంలో పరిష్కరించుకునేందుకు పోలీసులు అందుబాటులో ఉంటారని చెప్పారు. పల్లెనిద్ర కార్యక్రమం ద్వారా ప్రజలకు పోలీసు శాఖ మరింత చేరువగా ఉంటుందని పేర్కొన్నారు.

## విద్యార్థులకు ప్రతిరోజూ హోంవర్క్ ఇవ్వాలి



**నరసన్నపేట, సెప్టెంబరు 17 (వార్త):** ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు ఉపాధ్యాయులు తప్పనిసరిగా ప్రతిరోజూ హోంవర్క్ ఇవ్వాలని ఎంఈఓ ఉప్పాడ శాంతారావు సూచించారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాన్ని పెంచేందుకు తరగతి బోధనతో పాటు ఇంటి వద్ద చేసే అభ్యాసానికి కూడా ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు. గురువారం మధ్యాహ్నం నరసన్నపేట మండలం గొట్టిపల్లి ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థుల విద్యాభ్యాసం, ఉపాధ్యాయుల బోధనా విధానం, విద్యార్థులకు ఇస్తున్న హోంవర్క్, అసైన్‌మెంట్లను పరిశీలించారు. విద్యార్థులు ప్రతిరోజూ పూర్తి చేస్తున్న హోంవర్క్, అసైన్‌మెంట్లను ఉపాధ్యాయులు క్రమం తప్పకుండా పరిశీలించాలని ఆదేశించారు. వాటిలో విద్యార్థులు చేసిన తప్పులను గుర్తించి, వాటిని వెంటనే సరిదిద్దేలా అవసరమైన సూచనలు అందించాలని పేర్కొన్నారు. విద్యార్థుల పనితీరును ఎప్పటికప్పుడు గమనిస్తూ వారి అభ్యసనలో ఉన్న లోపాలను అధిగమించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎంఈఓ సూచించారు.

## డ్రంకెన్‌డ్రైవ్ కేసులో రూ.10 వేల జరిమానా

**నరసన్నపేట, సెప్టెంబరు 17 (వార్త):** మద్యం సేవించి ఆటో నడిపిన వ్యక్తికి నరసన్నపేట న్యాయస్థానం రూ.10 వేల జరిమానా విధించినట్లు ఎస్సై బి.గణేశ్ తెలిపారు. పోలీసులు ఇటీవల నిర్వహిస్తున్న తనిఖీల్లో భాగంగా తోట వెంకటరమణ అనే ఆటో డ్రైవర్ మద్యం సేవించి వాహనం నడుపుతున్నట్లు గుర్తించినట్లు ఎస్సై తెలిపారు. దీంతో నిబంధనల ప్రకారం ఆయనపై కేసు నమోదు చేసి, నరసన్నపేట న్యాయస్థానంలో హాజరుపరిచినట్లు పేర్కొన్నారు. కేసును పరిశీలించిన న్యాయమూర్తి ఎస్.వాణిరమణ ఆటో డ్రైవర్‌కు రూ.10 వేల జరిమానా విధించినట్లు ఎస్సై బి.గణేశ్ తెలిపారు. వాహనదారులు నిబంధనలు పాటించాలని సూచించారు. డ్రంకెన్‌డ్రైవ్‌కు పాల్పడే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

## 2 వేల మందికి అన్న సంతర్పణ

**మెళియాపుట్టి, సెప్టెంబరు 17(వార్త):** మెళియాపుట్టిలో శ్రీ వరసిద్ధి వినాయక నవరాత్రులలో భాగంగా స్థానిక రెడ్డి బజార్ లో యువకులు, గ్రామస్తులు ఆధ్వర్యంలో గురువారం నాడు 2 వేల మందికి అన్న సంతర్పణ కార్యక్రమాన్ని నిర్వహించారు. యువకులు గ్రామస్తులు ప్రతి ఒక్కరు సమన్వయంతో వ్యవహరించి జరిపిన అన్నసంతర్పణ కార్యక్రమంలో పరిసర ప్రాంతాల ప్రజలతోపాటు భక్తులు తదితరులు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించి వరసిద్ధి వినాయకుని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో యువకులు, గ్రామస్తులు, పరిసర ప్రాంత ప్రజలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



## కౌశలం ఉద్యోగ మేళా.. నిరుద్యోగులకు సదవకాశం

- 19న శ్రీకాకుళంలో నియామక ప్రక్రియ
- 10వ తరగతినుంచి బీటెక్ వరకు అర్హత

**పలాస, సెప్టెంబరు 17 (వార్త):** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న 'కౌశలం' కార్యక్రమంలో భాగంగా జిల్లాలో ఉద్యోగ మేళా నిర్వహించనున్నారు. జిల్లాలోని నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉపాధి పొందాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పిలుపునిచ్చారు. శ్రీకాకుళం జిల్లా ప్రజా పరిషత్ నూతన సమావేశ మందిరంలో ఈ నెల 19న శనివారం ఉదయం 8.30 గంటల నుంచి నియామక ప్రక్రియ ప్రారంభమవుతుంది. ప్రముఖ సంస్థ గ్రీన్‌టెక్ ఇండస్ట్రీస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధులు మేళాకు హాజరై అర్హులైన అభ్యర్థులను ఎంపిక చేయనున్నారు.

### ఎవరెవరు అర్హులు?

పదో తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ, ఐటీఐ, డిప్లొమా, బీటెక్ (మెకానికల్) విద్యార్హతలు కలిగిన 18 నుంచి 32 ఏళ్ల వయస్సు గల పురుష అభ్యర్థులు ఉద్యోగ మేళాకు హాజరుకావచ్చునని,ఎలాంటి పూర్వ అనుభవం లేని ఫ్రెషర్స్ కూడా దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారని పలాస మున్సిపల్ కమిషనర్ ఐ శ్రీనివాసులు వెల్లడించారు.

### వేతనంతోపాటు అదనపు ప్రయోజనాలు



ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.15,500 వేతనం చెల్లించనున్నారు. దీనికి అదనంగా హాజరు బోనస్, నైట్ షిఫ్ట్ అలవెన్స్, వర్క్‌స్టేషన్ అలవెన్స్ అందించనున్నారు. ఉచిత భోజనం, వసతి, సమీప పట్టణాల నుంచి ఉచిత రవాణా సౌకర్యం కల్పించనున్నారు. ఈపీఎఫ్, ఈఎస్ఐ, బోనస్, గ్రాట్యుటీ తదితర చట్టబద్ధమైన, సంక్షేమ ప్రయోజనాలు కూడా ఉంటాయని అధికారులు తెలిపారు.

యువతకు ఉపయోగకర అవకాశమని, స్థానికంగా ఉద్యోగ అవకాశాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగ యువతకు ఈ మేళా ద్వారా ప్రత్యక్ష నియామక అవకాశం లభించనుంది. విద్యార్హతకు అనుగుణంగా వివిధ విభాగాల్లో అవకాశాలను పరిశీలించుకునే వీలుండటంతో అర్హులైన పలాస--కాశీబుగ్గ ప్రాంత యువకులు మేళాకు హాజరై అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ కోరారు.

## ప్రజాధనం దోపిడీకిదే నిదర్శనం



**పాతపట్నం, సెప్టెంబరు 17(వార్త):** రోడ్డు మరమ్మతుల్లో నిబంధనలు, నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడం వల్లే పాతపట్నం నుండి టెక్కలి వెళ్లే ప్రధాన రహదారి అతి తక్కువ వ్యవధిలోనే మళ్లీ అధ్వానంగా తయారైందని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు, ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు బి. నారాయణమూర్తి మండిపడ్డారు. ఇది అధికారుల, ప్రజాప్రతినిధుల బాధ్యతారాహిత్యానికి, అధికార దుర్వినియోగానికి నిదర్శనమని విమర్శించారు. పాతపట్నం-టెక్కలి మార్గంలో ఉన్న అనేక వెనుకబడిన గ్రామాల ప్రజలు, నిత్యం ఆటోలు, బస్సులు, సొంత వాహనాలపై ప్రయాణిస్తుంటారని, గతంలో కురిసిన భారీ వర్షాలకు ఈ రోడ్డు గుంతలమయమై నిత్యం ప్రమాదాలకు నిలయంగా మారిందన్నారు. నాణ్యమైన రోడ్లు రాష్ట్రంలో నిర్మిస్తామని సీఎం చంద్రబాబు నాయుడు, స్థానిక నియోజకవర్గంలో రోడ్ల విస్తరణ చేపడతానని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ఇచ్చిన హామీలు మాటలకే పరిమితమయ్యాయన్నారు. రోడ్డు మరమ్మతులు జరుగుతున్న సమయంలోనే నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదని తను హెచ్చరించినా యంత్రాంగం పట్టించుకోలేదన్నారు. ఫలితంగా ప్రజాధనం దుర్వినియోగం కావడం తప్ప ప్రజలకు ఒరిగేమీ లేదని, బ్రిటిష్ వారు మన దేశాన్ని పాలించినప్పుడు నిర్మించిన కట్టడాలు ఇప్పటికీ మనం వాడుతున్నామని, కానీ నేటి పాలకుల స్వార్థం వల్ల రోడ్లు వేసిన కొద్ది రోజులకే పాడైపోతున్నాయని ఎద్దేవా చేశారు. ఇచ్చిన మాట ప్రకారం ఈ ప్రధాన రహదారిని తక్షణమే విస్తరించి, పూర్తిస్థాయిలో పునర్నిర్మించాలని నారాయణమూర్తి డిమాండ్ చేశారు.

## పదో తరగతి విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదవాలి



**మందస, సెప్టెంబరు 17(వార్త):** పదో తరగతి విద్యార్థులు ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని ప్రధానోపాధ్యాయుడు కూన వేణుగోపాలరావు అన్నారు. మందస మండలంలోని కొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం పదవ తరగతి చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులుతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఇటీవల జరిగిన ఎఫ్ఏ-1 పరీక్షలలో విద్యార్థులు సాధించిన ప్రగతిని సబ్జెక్టులు వారీగా ఉపాధ్యాయులు సమక్షంలో విశ్లేషణ చేశారు. అలాగే పదవ తరగతి విద్యార్థులకు వారి తల్లిదండ్రులు ఇంటి వద్ద చేపట్టాల్సిన అంశాలను ఆయా సబ్జెక్ట ఉపాధ్యాయులు కూలంకుషంగా వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జి.భీమారావు, జి.జానకమ్మ, ఎం.లక్ష్మణరావు, ఎ.అప్పారావు, బి.పాపమ్మ, ఎం.చిత్రసేను, జి.సూర్యనారాయణ, జి.చిన్నకృష్ణ, బి.రమేష్, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



## జలుమూరులో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం



**జలుమూరు, సెప్టెంబరు 17 (వార్త):** జలుమూరులో గురువారం ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరాన్ని నిర్వహించారు. జలుమూరు ఆయుష్ విభాగం, ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల ఆధ్వర్యంలో డాక్టర్ శివశంకర్ పర్యవేక్షణలో ఈ శిబిరం జరిగింది. శిబిరానికి హాజరైన ప్రజలకు వైద్యులు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, వారి ఆరోగ్య పరిస్థితిని పరిశీలించారు. వివిధ అనారోగ్య సమస్యలతో వచ్చిన వారికి ఆయుర్వేద వైద్య విధానంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆహారపు అలవాట్లు, ఆరోగ్య పరిరక్షణపై అవసరమైన సూచనలు అందించారు. వైద్యుల సూచనల మేరకు అవసరమైన మందులను కూడా ఉచితంగా పంపిణీ చేశారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు అందుబాటులో వైద్య సేవలు కల్పించాలనే ఉద్దేశంతో ఇటువంటి ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం ఉపయోగకరంగా ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. ప్రజలు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సింహాచలం, రామారావు, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

## తిలారు ఆర్ఎస్‌లో ఘనంగా పల్లకీ సేవ

**జలుమూరు, సెప్టెంబరు 17 (వార్త):** తిలారు ఆర్ఎస్‌లోని సత్య సాయిరాం మందిరంలో గురువారం ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం భక్తుల సందడితో ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది. కార్యక్రమంలో భాగంగా భక్తులు పల్లకీ సేవను సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. పక్క గ్రామాల నుంచి వచ్చిన సాయిబాబా భక్త బృందాలు ప్రత్యేకంగా పాల్గొని భజనలు, ఆధ్యాత్మిక ప్రవచనాలతో భక్తులను అలరించారు. అనంతరం భక్తి గీతాలు, భజనలతో తిరువీధి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చిన భక్తులతో పాటు స్థానిక గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సాయిబాబా నామస్మరణతో పరిసర ప్రాంతాలు మార్మోగగా, భక్తులు ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆలయ నిర్వాహకులు కార్యక్రమానికి హాజరైన భక్తులకు అవసరమైన ఏర్పాట్లు చేశారు.



## క్యాన్సర్ వ్యాధిగ్రస్తుడైన విద్యార్థిని ఆదుకోవాలి

### -ఎస్ఎంఆర్ ఫౌండేషన్ విజ్ఞప్తి

**మందస, సెప్టెంబరు 17(వార్త):** క్యాన్సర్ వ్యాధితో పోరాడుతున్న పేద విద్యార్థి సారక శివకుమార్ వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక సహాయం అందించాలని కోరుతూ సాయి మోహన్ రిసోర్సెస్(ఎస్ఎంఆర్) ఫౌండేషన్ రూపొందించిన కరపత్రాన్ని ప్రముఖ సంఘ సేవకుడు గిన్ని తిరుపతిరెడ్డి, మందస ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ తేజేశ్వరరావు, కళాశాల అధ్యాపక బృందం గురువారం విడుదల చేశారు. ప్రిన్సిపాల్ తేజేశ్వరరావు మాట్లాడుతూ మందస మండలంలోని బుడార్సింగి పంచాయతీలోని నరసింగపురం గ్రామానికి చెందిన శివకుమార్ చిన్నతనంలోనే తండ్రిని కోల్పోయాడని తెలిపారు. ప్రస్తుతం మందస ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఒకేషనల్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఈ విద్యార్థికి ఇటీవల వైద్యులు బ్లడ్ క్యాన్సర్ ఉన్నట్లు నిర్ధారించారన్నారు. అత్యంత పేద కుటుంబానికి చెందిన ఈ విద్యార్థిని ఆదుకోవడానికి ఎస్ఎంఆర్ ఫౌండేషన్ ముందుకొచ్చి నిధులు సమీకరించడం అభినందనీయమన్నారు. సంఘ సేవకుడు గిన్ని తిరుపతిరెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం శివకుమార్ విశాఖపట్నంలోని ఆసుపత్రిలో ఆరోగ్యశ్రీ పథకం ద్వారా చికిత్స పొందుతున్నప్పటికీ, రోజువారీ మందులు, ఇతర వైద్య ఖర్చులకు కుటుంబం తీవ్ర ఇబ్బందులు పడుతోందని తెలిపారు. దాతలు ఉదారంగా స్పందించి శివకుమార్ ప్రాణాలను కాపాడాలని పిలుపునిచ్చారు. ఉదార మనస్సుతో సహాయం అందించబోయే దాతలు ఫోటోలోని స్కానర్ కు గాని, ఈ ఫోన్ పే నెంబర్ కు.8096019686 (డాక్టర్ మోహనాచారి) అందజేయాలని ఎస్ఎంఆర్ ఫౌండేషన్ ప్రతినిధులు కోరారు.






జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలి

## - వైసీపీ శ్రేణులకు

### మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి పిలుపు





**మెళియాపుట్టి, సెప్టెంబరు 17(వార్త):** స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి పిలుపు నిచ్చారు. మెళియాపుట్టిలోని కమల కళ్యాణ మండపంలో గురువారం జరిగిన వైసీపీ విస్తృతస్థాయి సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా రెడ్డి శాంతి మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలకు, ప్రస్తుత ప్రభుత్వ విధానాలకు చాలా వ్యత్యాసం ఉందని, కూటమి ప్రభుత్వం కేవలం మాటలకే పరిమితమైందన్నారు. నియోజకవరగ& అభివృద్ధి, పాలన కుంటుపడిందన్నారు. రానున్న రోజులలో జరుగనున్న స్థానిక ఎన్నికల్లో వైసీపీ సత్తా చాటేలా ప్రతి కార్యకర్త క్షేత్రస్థాయిలో ప్రజలతో మమేకమై సైనికుల వలె పనిచేయాలని కోరారు. అన్ని సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాల్లో వైసీపీ అభ్యర్థులను బరిలో నిలిపి గెలిపించేందుకు కార్యాచరణ రూపొందించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. పంచాయతీల్లో ఏకగ్రీవాలకు అంగీకరించకుండా పార్టీ శ్రేణులు ఎన్నికలను ధైర్యంగా ఎదుర్కోవాలన్నారు. అనంతరం నాయకులు, కార్యకర్తలకు జగనన్న ఐడీ కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలకు టాయిలెట్ మెటీరియల్ పంపిణీ



**నరసన్నపేట, సెప్టెంబరు 17 (వార్త):** బాడాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్ల పరిశుభ్రతను మెరుగుపరిచేందుకు అవసరమైన టాయిలెట్ మెటీరియల్‌ను గురువారం అందజేశారు. క్లస్టర్ పరిధిలోని పాఠశాలలకు సామగ్రిని అందుబాటులోకి తీసుకురావడంతో విద్యార్థులకు పరిశుభ్రమైన వాతావరణం కల్పించేందుకు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎంఈవో ఉప్పాడ శాంతారావు మాట్లాడుతూ బాడాం క్లస్టర్ పరిధిలోని మొత్తం 18 ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించిన టాయిలెట్ మెటీరియల్ వచ్చిందని తెలిపారు. సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తమకు కేటాయించిన సామగ్రిని తీసుకెళ్లి, మరుగుదొడ్ల నిర్వహణకు వినియోగించాలని సూచించారు. పాఠశాలల్లో విద్యార్థుల ఆరోగ్యం, సౌకర్యాలను దృష్టిలో ఉంచుకుని మరుగుదొడ్లను ప్రతిరోజూ పరిశుభ్రంగా ఉంచాలని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు సూచించారు. పరిశుభ్రత సామగ్రిని సక్రమంగా వినియోగిస్తూ మరుగుదొడ్ల నిర్వహణపై నిరంతరం పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## బొరిగివలసలో ఎల్సీడీసీ సర్వే పరిశీలన



**నరసన్నపేట, సెప్టెంబరు 17 (వార్త):** బొరిగివలసలోని ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాన్ని డిప్యూటీ పారా మెడికల్ ఆఫీసర్ వాన సురేష్‌కుమార్ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా సచివాలయ పరిధిలో నిర్వహిస్తున్న ఎల్సీడీసీ సర్వే కార్యక్రమం అమలు తీరును పరిశీలించారు. సర్వేలో భాగంగా సేకరిస్తున్న వివరాలు, క్షేత్రస్థాయిలో సిబ్బంది నిర్వహిస్తున్న విధానాన్ని ఆయన పరిశీలించి అవసరమైన సూచనలు చేసినట్లు తెలిపారు. సర్వే కార్యక్రమాన్ని నిర్దేశించిన విధంగా సమర్థవంతంగా నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం బొరిగివలస జిల్లా పరిషత్ హైస్కూల్‌లో విద్యార్థులకు ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్య పరిరక్షణకు సంబంధించిన విషయాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఆరోగ్య సమస్యలు ఎదురైనప్పుడు నిర్లక్ష్యం చేయకుండా సమీపంలోని ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ వందన, ఏఎన్ఎం జయలక్ష్మీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రధాని మోదీ జన్మదిన వేడుకలు

**సోంపేట, సెప్టెంబరు 17 (వార్త):** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జన్మదిన వేడుకలను సోంపేటలో స్థానిక బిజెపి నేతల ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ముందుగా లోకనాదేశ్వర ఆలయంలో బిజెపి, టిడిపి, జనసేన కూటమి నేతలు హాజరై స్వామివారికి మోడీ పేరిట ప్రత్యేక పూజలు నిర్వహించారు. హాజరైన ప్రతి ఒక్కరూ ఒక్కొక్క కొబ్బరికాయని అభిషేకిస్తూ భారతదేశాన్ని ప్రధానమంత్రి మోడీ మరింత కాలం పరిపాలించి ఈ దేశాన్ని ఇంకా ఉన్నతంగా అభివృద్ధి సాధించే శక్తిని, ఆరోగ్యాన్ని భగవంతుడు ప్రసాదించాలని కోరుకున్నారు. అనంతరం శ్రీ శయన వీధిలో ప్రాథమిక పాఠశాల ఆవరణలో పుట్టిన రోజు కేకును విద్యార్థులచే కట్ చేయించారు. బిజెపి జిల్లా కార్యదర్శి బీన వంశీ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ దేశంలో విద్యారంగం, ఉద్యోగరంగం అభివృద్ధికి చేస్తున్న కృషిని వివరించారు. బాలలు చక్కగా చదువుకొని మంచి క్రమశిక్షణతో దేశ గౌరవం మరింత ఇనుమడించేలా భవిష్యత్తులో మంచి అవకాశాలు పొందాలని కోరారు. కార్యక్రమంలో మండల బిజెపి అధ్యక్షుడు టి విజయ్ కుమార్, మాజీ ఎంపీపీ చిత్రాడ శ్రీనివాస్, చిత్రాడ శేఖర్, మద్దిల నాగేశ్వరరావు, దూసి మధు, వూనా పాండురంగ, కొంచాడ రవి, రెల్ల నారాయణ, బీన ప్రదీప్, బొమ్మిడి తేజ తదితరులు పాల్గొన్నారు.



## రైతుల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే



**పాతపట్నం, సెప్టెంబరు 17(వార్త):** రైతుల సంక్షేమం, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే ఎన్డీఏ కూటమి ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని పాతపట్నం శాసనసభ్యులు మామిడి గోవిందరావు ఉద్ఘాటించారు. పాతపట్నం మండలంలోని తామర గ్రామంలో రైతుల సాగు అవసరాల నిమిత్తం ఆయన ప్రత్యేక చొరవతో ఏపిఈపిడిసిఎల్ ఆధ్వర్యంలో సుమారు రూ. 54 లక్షల వ్యయంతో మంజూరైన ఉచిత వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు, నూతన ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ లైన్‌ను గురువారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటల సాగుకు నీరు ఎంత అవసరమో, దానికి సరిపడా విద్యుత్ కూడా అంతే కీలకమని, రైతులు సకాలంలో పంటలు వేసుకునేందుకు వీలుగా మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని తెలిపారు. తామర గ్రామ రైతుల సుదీర్ఘ అవసరాన్ని గుర్తించి రూ. 54 లక్షల నిధులతో విద్యుత్ సౌకర్యాలు అందుబాటులోకి తీసుకురావడం సంతోషంగా ఉందని, నియోజకవర్గ వ్యాప్తంగా రైతులు ఎదుర్కొంటున్న సాగునీరు, విద్యుత్, రహదారుల సమస్యలను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరిస్తామని గోవిందరావు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు, విద్యుత్ శాఖ అధికారులు మరియు గ్రామ రైతులు పాల్గొన్నారు.

## పండగలా మోదీ ప్రజా ప్రస్థాన వేడుకలు



**మందస, సెప్టెంబరు 17(వార్త):** హరిపురం-బాలిగాం జంక్షన్ వద్ద ఉన్న తెలుగుదేశం పార్టీ కార్యాలయ ఆవరణలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రజా ప్రస్థాన వేడుకలు శోభాయమానంగా మారింది. భారతదేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రజాసేవలో 25 సంవత్సరాల సుదీర్ఘ ప్రజాప్రస్థానాన్ని విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా, అలాగే ఆయన జన్మదినాన్ని పురస్కరించుకుని మందస మండల తెలుగుదేశం పార్టీ, కూటమి నాయకులు, కార్యకర్తలు కలసి అత్యంత ఉత్సాహంగా, ఘనంగా వేడుకలు నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలు, పలాస శాసనసభ్యురాలు గౌతు శిరీష దిశానిర్దేశం మేరకు నిర్వహించబడ్డాయి. హరిపురం-బాలిగాం జంక్షన్ వేదికగా ప్రారంభమైన ఈ కార్యక్రమంలో భారీ సంఖ్యలో పార్టీ శ్రేణులు పాల్గొని కొవ్వొత్తులు వెలిగించి, ప్రదర్శనగా ర్యాలీ నిర్వహించారు. ప్రధాని మోదీ హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆయన దీర్ఘాయుష్షు పొందాలని, దేశ సేవలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమానికి మందస మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు బావన దుర్యోధన నాయకత్వం వహించగా, మండల కార్యదర్శి సాలీనా మాధవరావు పాటు సీనియర్ నాయకులు దాసరి తాతారావు, రట్టి లింగరాజు, భాస్కరరావు తమరియా సమన్వయకర్తలుగా వ్యవహరించి కార్యక్రమాన్ని జయప్రదం చేశారు. కార్యక్రమంలో భాగంగా అధ్యక్షుడు బావన దుర్యోధన మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ గడచిన పాతికేళ్లుగా నిరంతరం ప్రజాసేవకే అంకితమయ్యారని, వారి సమర్థవంతమైన పాలన దేశాభివృద్ధికి, ప్రపంచ స్థాయిలో భారత్ ప్రతిష్ఠ పెరగడానికి నిదర్శనమని కొనియాడారు. ఈ వేడుకను దిగ్విజయం చేసేందుకు తరలివచ్చిన కూటమి నాయకులు, క్లస్టర్ ఇంఛార్జీలు, కో-ఇంఛార్జీలు, యూనిట్ కన్వీనర్లు, కో-కన్వీనర్లు, బూత్ కన్వీనర్లు, గ్రామ కమిటీ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయి కమిటీల నాయకులు, ప్రజాప్రతినిధులు మరియు విలేకరి సోదరులందరికీ వారు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కూటమి నాయకుల ఐక్యత, కార్యకర్తల ఉత్సాహంతో ఈ కార్యక్రమం విజవంతమైందని పేర్కొన్నారు.

## వైన్ షాపుల లైసెన్సుల పునరుద్ధరణపై సమీక్ష

**పాతపట్నం, సెప్టెంబరు 17(వార్త) :** పాతపట్నం ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని ఏ4 వైన్ షాపుల లైసెన్సుల పునరుద్ధరణ (రెన్యూవల్) ప్రక్రియపై స్థానిక కార్యాలయంలో గురువారం శ్రీకాకుళం ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ (ఏసీ) రామచంద్రరావు ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. శ్రీకాకుళం ఏఈఎస్, పాతపట్నం ఎస్‌హెచ్‌ఓల సమక్షంలో జరిగిన ఈ సమావేశంలో పాతపట్నం పరిధిలోని ఏ4 షాపుల లైసెన్సుదారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏసీ మాట్లాడుతూ వైన్ షాపుల లైసెన్సుల పునరుద్ధరణకు సంబంధించి ప్రభుత్వం విడుదల చేసిన నూతన మార్గదర్శకాలను, నిబంధనలను వివరించారు. నిర్దేశిత వ్యవధిలోగా పాతపట్నం స్టేషన్ పరిధిలోని అన్ని ఏ4 షాపుల 100 శాతం రెన్యూవల్ ప్రక్రియ పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను, లైసెన్స్‌దారులను ఆదేశించినట్లు సీఐ కోట కృష్ణారావు తెలిపారు.



## ఉమాగిరి, బీఎస్ పురంల్లో పోషణ మాసోత్సవాలు



**మందస, సెప్టెంబరు 17(వార్త):** జిల్లుండ గ్రామ పంచాయతీలో గల ఉమాగిరి. భైరిసారంగపురంలలోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాసోత్సవాలు నిర్వహించారు. 9వ జాతీయ పోషణ మాసోత్సవాలు సందర్భంగా సూపర్‌వైజర్ సీహెచ్.వి. రామలక్ష్మి ఆధ్వర్యంలో పోషణ మాసోత్సవాల ఆవశ్యకతను వివరించారు. అంగన్ వాడీ భోజనం అంటే తాజా, వేడి, పోషకమైన భోజనమని వివరించారు. అంగన్ వాడీ కేంద్రాల్లో అందిస్తున్న పౌష్టికాహారం ఆవశ్యకత చెప్పారు. సీజనల్ వ్యాధులపై జాగ్రత్తలు, గర్భిణీలు, బాలింతలు, ఏడు నెలల నుంచి 6సంవత్సరాల పిల్లలకు అందించే పోషకాహారంపై తెలిపారు. గర్భిణీ జాగ్రత్తలు, తల్లిపాల ప్రాముఖ్యతకు చెప్పారు. అదేవిధంగా సామూహిత సీమంతాలు కూడా నిర్వహించారు. భైరిసారంగపురం పంచాయతీలో సూపర్ వైజర్ రాజేశ్వరి ఆధ్వర్యంలో పోషణ మాసోత్సవాలు జరిగాయి. కార్యక్రమంలో అంగన్ వాడీ కార్యకర్తలు నాగవేణి, హైమావతి, లలిత, అంగన్ వాడీ కేంద్రాల లబ్ధిదారులు పాల్గొన్నారు.

## బారువాలో ఉచిత వైద్య శిబిరం



**సోంపేట, సెప్టెంబరు 17(వార్త):** బారువ మేజర్ పంచాయతీలో శ్రీకాకుళం మెడి కవర్ హాస్పిటల్ సౌజన్యంతో స్థానిక వైసీపీ శ్రేణుల ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. స్థానిక అగ్నికుల క్షత్రియ సంఘ భవనం వద్ద నిర్వహించిన ఈ శిబిరానికి పెద్ద సంఖ్యలో రోగులు హాజరయ్యారు. రోగులకు వివిధ పరీక్షలు నిర్వహించిన వైద్యులు అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. స్థానిక నేతలు బుజ్జి, శ్రీను, రాజేష్ ఖన్నా, ధర్మారావు, సత్యం, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## నేడు దివ్యాంగులకు ప్రత్యేక గ్రీవెన్స్

**మందస, సెప్టెంబరు 17(వార్త):** దివ్యాంగుల సమస్యలను జిల్లా కలెక్టర్ కు తెలియజేయడానికి దివ్యాంగులకు ఈనెల 18న ప్రత్యేక గ్రీవెన్స్(స్వాభిమాన్) నిర్వహిస్తున్నారని దివ్యాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి, మదర్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు మల్లారెడ్డి భాస్కరరావు చెప్పారు. 18న(శుక్రవారం) ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 12గంటల వరకు దివ్యాంగుల ప్రత్యేక గ్రీవెన్స్ శ్రీకాకుళంలోని జిల్లా పరిషత్ సమావేశం మందిరం శ్రీకాకుళం నందు నిర్వహించబడుతుందన్నారు. కార్యక్రమాన్ని దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## తెంబూరులో ఉచిత హోమియో వైద్య శిబిరం



**పాతపట్నం, సెప్టెంబరు 17 (వార్త):** తెంబూరు గ్రామంలో ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా గురువారం ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహించారు. స్థానిక సత్యసాయి ఆలయం వద్ద ప్రభుత్వ హోమియో వైద్యాధికారి డాక్టర్ ఎస్ ఉమాగౌరి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరానికి బిజెపి కిషన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి అన్నెపు ఉమామహేశ్వరరావు, బిజేపి శ్రేణులు, సిబ్బంది దివ్యరెడ్డి పాల్గొన్నారు. శిబిరానికి వచ్చిన సుమారు 62 మంది రోగులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి, మందులను పంపిణీ చేశారు. ప్రధాని మోదీ చూపిన సేవా మార్గంలో ప్రతి ఒక్కరు నడవాలని, ప్రజాసేవే పరమావిధిగా పనిచేయాలని ఉమామహేశ్వరరావు పిలుపునిచ్చారు. మోడీ పుట్టినరోజు సందర్భంగా ఇటువంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

## కాడెద్దుల గణేష్‌ను దర్శించుకున్న జడ్పీ ఛైర్ పర్సన్

**కవిటి, సెప్టెంబరు 17(వార్త):** రాజపురం గ్రామంలో కళింగ వీధిలో ఏర్పాటు చేసిన కాడెద్దుల గణపతి విగ్రహం అందర్నీ ఆకట్టుకుంటుంది. జిల్లా పరిషత్ ఛైర్ పర్సన్ పిరియా విజయ గురువారం ఈ విగ్రహాన్ని సందర్శించి విఘ్నేశ్వరునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ప్రతినిధి కడియాల ప్రకాష్, ఎంపీటీసీ లొట్టి సోమేశ్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# 36వ వార్డులో రిజర్వేషన్లపై అభ్యంతరం!

**- ఎస్సీ, ఎస్టీ ఓట్లను బీసీలుగా చూపించారంటూ ఫారం--3తో ఫిర్యాదు**

**- జనాభా నిష్పత్తి ఆధారంగానే రిజర్వేషన్లు ఖరారు చేయాలని డిమాండ్**

**పలాస, సెప్టెంబరు 17 (వార్త):** పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో వార్డుల రిజర్వేషన్ల ఖరారు ప్రక్రియపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా 36వ వార్డుకు సంబంధించిన ఓటర్ల జాబితాలో ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన ఓట్లను బీసీలుగా నమోదు చేశారంటూ జనసేన నాయకులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ మేరకు 36వ వార్డుకు చెందిన జనసేన నాయకుడు తోట ప్రశాంత్ గురువారం మున్సిపల్ కమిషనర్ ఐ.శ్రీనివాసులుకు ఫిర్యాదు చేశారు. ఓటర్ల జాబితాను పరిశీలించి, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన ఓటర్లు బీసీలుగా నమోదైనట్లు గుర్తించిన వివరాలను ఫారం--3 ద్వారా అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు ప్రశాంత్ తెలిపారు. వార్డుల రిజర్వేషన్లను కేవలం ఓటర్ల సంఖ్య ఆధారంగా కాకుండా.. అధికారిక జనాభా గణాంకాలు, సామాజిక వర్గాల జనాభా నిష్పత్తి, గత రిజర్వేషన్ల రొటేషన్ తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని పారదర్శకంగా ఖరారు చేయాలని కోరారు.

### ఎస్సీ, ఎస్టీ జనాభాపై స్పష్టత ఏదీ?

మున్సిపాలిటీలోని 36 వార్డులకు రిజర్వేషన్లు ఖరారు చేసే క్రమంలో ఎస్సీ, ఎస్టీ జనాభా వివరాలు కీలకం కానున్నాయి. ఆయా వార్డుల్లో వాస్తవంగా ఎంత జనాభా ఉంది? అందులో ఎస్సీ, ఎస్టీ వర్గాల జనాభా ఎంత? ఓటర్ల జాబితాలో ఆ వర్గాలకు చెందిన వారు ఏ విధంగా నమోదయ్యారు? అనే అంశాలపై స్పష్టత ఇవ్వాలని కోరారు. ఓటర్ల జాబితాలో సామాజిక వర్గాలకు సంబంధించిన వివరాల్లో తేడాలు ఉంటే.. వాటి ఆధారంగా రిజర్వేషన్ల ప్రక్రియ కొనసాగితే వాస్తవ జనాభా నిష్పత్తికి భిన్నమైన ఫలితాలు వచ్చే అవకాశం ఉందని, అభ్యంతరకారులు తెలిపారు.

రిజర్వేషన్ల ఖరారులో ఏ గణాంకాలను ప్రామాణికంగా తీసుకుంటారన్నదేని స్పష్టం చేయాలన్నారు. వార్డుల వారీగా జనాభా వివరాలు, అధికారిక జనాభా లెక్కలు, ఎస్సీ--ఎస్టీ జనాభా నిష్పత్తి, గతంలో అమలు చేసిన రిజర్వేషన్ల రొటేషన్ వంటి అంశాల ఆధారంగా ప్రక్రియ చేపడతారా? అనే దానిపై అధికారులు స్పష్టత ఇవ్వాల్సి ఉందన్నారు. ఓటర్ల జాబితాలో నమోదైన వివరాల్లో పొరపాట్లు ఉంటే వాటిని ముందుగా పరిశీలించి సరిచేసిన అనంతరం రిజర్వేషన్ల ప్రక్రియ చేపట్టాలని తోట ప్రశాంత్ కోరుతున్నారు.

36వ వార్డుపై ప్రత్యేక దృష్టి సారించాలని, 36వ వార్డులో ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన ఓట్లను బీసీగా చూపించిన అంశాన్ని గుర్తించి, సంబంధిత వివరాలను పరిశీలించినట్లు తోట ప్రశాంత్ తెలిపారు. ఫారం--3 ద్వారా అభ్యంతరాలు సమర్పించడంతోపాటు వార్డులోని జనాభాను సామాజిక వర్గాల వారీగా పరిశీలించి, నిష్పత్తి ప్రకారం రిజర్వేషన్ ఖరారు చేయాలని కమిషనర్‌ను కోరినట్లు చెప్పారు.

పునర్విభజన నేపథ్యంలో.. ఇటీవల వార్డుల విభజన, ఓటర్ల జాబితా రూపకల్పనపైనా పలు అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. ఒకే ఇంటికి చెందిన కుటుంబ సభ్యుల ఓట్లు వేర్వేరు వార్డుల్లో నమోదైన సందర్భాలు ఉన్నాయన్న ఆరోపణలు వెలువడ్డాయి. ఈ నేపథ్యంలో వార్డు సరిహద్దులు, మొత్తం జనాభా, ఎస్సీ--ఎస్టీ జనాభా, ఓటర్ల వివరాలను సమగ్రంగా పరిశీలించిన తర్వాతే రిజర్వేషన్లు ఖరారు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

గణాంకాలు బహిర్గతం చేయాలని, 36 వార్డుల వారీగా మొత్తం జనాభా, ఎస్సీ--ఎస్టీ జనాభా, ఓటర్ల సంఖ్య, గతంలో అమలు చేసిన రిజర్వేషన్లు, రొటేషన్ క్రమం తదితర వివరాలను అధికారులు బహిర్గతం చేయాలని పలువురు కోరుతున్నారు. ఈ వివరాలు అందుబాటులోకి వస్తే రిజర్వేషన్లపై నెలకొన్న సందేహాలకు స్పష్టత వస్తుందని తెలిపారు. వచ్చిన అభ్యంతరాలను సమగ్రంగా పరిశీలించి, అధికారిక గణాంకాల ఆధారంగా తుది రిజర్వేషన్లు ఖరారు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.



## వైభవంగా వినాయకుని ఊరేగింపు



**మందస, సెప్టెంబరు 17(వార్త):** నర్సింగపురం పంచాయతీ దేవుపురంలో వినాయక నిమజ్జనం కార్యక్రమం వైభవంగా జరిగింది. సంస్కృతి, సంప్రదాయబద్దంగా నిర్వాహకులు నిర్వహించారు. పినకాన తేజేశ్వరరావు ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగినట్టు తేజేశ్వరరావు చెప్పారు. క్రాంతి యువజన సంఘం నాయకులు సంయుక్తంగా ఘనంగా కార్యక్రమాలను విజయవంతం చేశారు. పోలవరం ప్రత్యేకంగా కోలాటం తీసుకువచ్చారు. విగ్రహానికి మామిడి సాంబమూర్తి, అనసూయ దంపతులు అందించారు. కార్యక్రమంలో తేజేశ్వరరావు, ఉమాశంకర్, క్రిష్ణ, సురేష్, సంతు, భవానీశంకర్, బాలరాజు, శివ, అనిల్, సోమేశ్, ఈశ్వరరావు, పాపారావు, పద్మనాభం, భీమో, చిన్నక్రిష్ణ, తేజేశ్వరరావు, యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రధాని మోదీ జన్మదిన వేడుకలు



**ఇచ్ఛాపురం, సెప్టెంబరు 17 (వార్త):** ప్రధానమంత్రి నరేంద్ర దామోదర్ దాస్ మోడీ 76 వ జన్మదినోత్సవం సందర్భంగా బిజెపి పట్టణ అధ్యక్షులు సాలిన ఢిల్లీ రావు ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమలు చేపట్టారు. ఉదయం గ్రామ దేవత స్వేచ్ఛవతి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు, బోర్డర్ లో విశ్వకర్మ పూజ మండపం దగ్గర పూజలు నిర్వహించారు, ప్రభుత్వం హాస్పిటల్ లో అనారోగ్యం తో ఉన్న రోగుల కు బ్రేడ్, జ్యూస్ అందించారు.వాసవి కన్యాకాపరమేశ్వరి ఆలయం లో ఆశీర్వాద దీపలు వెలిగించారు. ఈ కార్యక్రమం లో జిల్లా కోశాధికారి వి క్రిష్ణ ప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షురాలు మంగి లక్ష్మి, పి. శ్రీనివాస్, కే శ్రీనివాస్, రత్నాల నారాయణ, వాసు రెడ్డి, ధనుష్ రంగా, సాడి ధర్మ, భాస్కర్ రెడ్డి, శంకర నారాయణ, గుడియా విశ్వనాధ్, కిరణ్ దాస్, చెన్నూరు ధర్మరాజు, మార్కండేయ, తరుణరాజ్, శశి, రాపాక రాజేశ్వరి, చినపాన సురేష్, మొహంతి, హిందూ శేఖర్, బోణికల దుర్యోధన్, పైల విగ్నేష్, తదితరులు పాల్గొన్నారు.

## కంచిలి కార్యాలయాలకు పక్కా రోడ్డు



**కంచిలి, సెప్టెంబరు 17 (వార్త):** కంచిలి మండల కేంద్రంలో తహసిల్దార్ కార్యాలయం, ఎంపీడీవో కార్యాలయం, వ్యవసాయ శాఖ కార్యాలయం, పోలీస్ స్టేషన్ తదితర కార్యాలయాలకు వెళ్లే మార్గానికి ఎట్టకేలకు మంచి రోజులు వచ్చాయి. టిడిపి మండల అధ్యక్షుడు మాదిన రామారావు, యువ నేత మాదిన ప్రదీప్ కృషితో 5 లక్షల రూపాయల అంచనా వ్యయంతో పక్కాగా సిమెంట్ రహదారి నిర్మాణాన్ని గురువారం చేపట్టారు. మెయిన్ రోడ్ నుంచి కార్యాలయాల వరకు సిమెంట్ రహదారి నిర్మాణం పట్ల అన్ని వర్గాలు హర్షం వ్యక్తం చేశాయి. ముఖ్యంగా నేతల కృషిని ప్రశంసించారు.

## కిష్టిపురంలో కొవ్వొత్తులతో 'ఆశీర్వాద్ కా దియా'



**పలాస, సెప్టెంబరు 17 (వార్త):** ప్రధానమంత్రి జన్మదినాన్ని పురస్కరించుకుని పలాస మండలం కిష్టిపురం గ్రామంలోని బూత్ నంబరు 32 పరిధిలో గురువారం 'సేవా సంకల్ప అభియాన్', 'ఆశీర్వాద్ కా దియా' కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు కొవ్వొత్తులు వెలిగించి ప్రధానమంత్రికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ప్రజాసేవ, సంక్షేమం, దేశాభివృద్ధి లక్ష్యాలపై ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు సేవా కార్యక్రమాల ద్వారా ప్రజలకు చేరువ కావాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బుర్ల కృష్ణంరాజు తెలిపారు. 'సేవే సంకల్పం.. అభివృద్ధే లక్ష్యం' అనే సందేశంతో ప్రజల భాగస్వామ్యంతో సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేస్తామని అన్నారు. అనంతరం పరస్పరం శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ఈ కార్యక్రమంలో బూత్ స్థాయి నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.ద

## ఉద్యోగమేళా సద్వినియోగం చేసుకోవాలి

**సోంపేట, సెప్టెంబరు 17 (వార్త):** ఈనెల 19న శ్రీకాకుళంలోని జిల్లా పరిషత్ నూతన సమావేశ మందిరంలో నిర్వహించనున్న ఉద్యోగమేళాను సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ ఎంపీడీవో ఎం.శాంతకుమారి కోరారు. గతంలో నిర్వహించిన కౌసలం సర్వే లో భాగంగా గుర్తించిన నిరుద్యోగుల కోసం ప్రత్యేకంగా ఈ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ కృషి మేరకు ఏర్పాటు చేయబడిన ఈ జాబ్ మేళా కార్యక్రమంలో అభ్యర్థులు పాల్గొని ఉపాధి అవకాశాలు పొందాలని శాంతకుమారి కోరారు. గ్రీన్ టెక్ ఇండస్ట్రీస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ లో ఉపాధి అవకాశాలు పొందే అవకాశం ఉందని పేర్కొన్నారు.



## మోదీ జన్మదినం సందర్భంగా సేవా కార్యక్రమాలు




**పలాస, సెప్టెంబరు 17 (వార్త):** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో గురువారం నుంచి అక్టోబరు 17వ తేదీ వరకు వివిధ సేవా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు పార్టీ నాయకులు తెలిపారు. ఇందులో భాగంగా గురువారం కాశీబుగ్గలోని శ్రీశ్రీశ్రీ కాశీ విశ్వేశ్వర ఆలయంలో మోదీ ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేశ ప్రజల కోసం నిరంతరం సేవలందిస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మరింత కాలం ఆరోగ్యంగా ఉండాలని, దేశం మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షిస్తూ భగవంతుడిని ప్రార్థించినట్లు నాయకులు తెలిపారు.

### ఉచిత వైద్య శిబిరం

బడుగు, బలహీన వర్గాలు, పేదలు, అనారోగ్యంతో బాధపడుతున్న వారికి వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో పలాస రైల్వేస్టేషన్ వద్ద మెగా వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు కృష్ణచంద్ర త్రిపాఠి, రూప, ఫణిమాధవ, ప్రవీణ్ తదితరులు పాల్గొని ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేయడంతోపాటు ఆరోగ్యంపై పలు సూచనలు, సలహాలు అందించారు.

సాయంత్రం 6 గంటలకు శ్రీశ్రీశ్రీ పెంటపోలమ్మ దేవాలయంలో 'ఆశీర్వాద్ కా దియా' కార్యక్రమంలో భాగంగా దీపాలు వెలిగించారు. ప్రతి ఇంటిలోనూ దీపాలు వెలిగించి మోదీ ఆయురారోగ్యాలతో ఉండాలని, దేశ ప్రజలకు మరింత సేవ చేయాలని, దేశం అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని భగవంతుడిని ప్రార్థించాలని పార్టీ నాయకులు పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు పాలవలస వైకుంఠరావు, సేవా సంకల్ప ఉత్సవ కమిటీ సభ్యుడు రామానంద స్వామి, పట్టణ అధ్యక్షుడు పొట్నూరు తారకేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యుడు కాంచరణ భుజంగరావు, పట్టణ ప్రధాన కార్యదర్శులు బొండా శ్రీనివాసరావు, హనుమంతు రామారావు, బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి గుంటు హైఅప్పారావు, పట్టణ కార్యదర్శులు బుద్ధిరెడ్డి శ్రీనివాసరావు, అన్నెపు వైకుంఠరావు, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు లక్కోజు ధర్మారావు, జిల్లా ఉపాధ్యక్షుడు బూర్జి కోటేశ్వరరావు, బూర్జపేట హరికృష్ణ, ఇప్పిలి వెంకటరావు, రైల్వే బుకింగ్ చీఫ్ ఎన్‌వీఎల్ఎన్ మూర్తి, రైల్వే ఫుడ్ సేఫ్టీ అధికారి రవివర్మ తదితరులు పాల్గొన్నారు.

## రావులవలసలో పారిశుధ్య పనుల పరిశీలన



**నరసన్నపేట, సెప్టెంబరు 17 (వార్త):** నరసన్నపేట మండలం రావులవలస పంచాయతీలో పారిశుద్ధ్య నిర్వహణను డిప్యూటీ ఎంపీడీవో పిల్లా జగన్మోహన్‌రావు గురువారం ఉదయం పరిశీలించారు.

గ్రామంలోని పలు ప్రాంతాల్లో పర్యటించి పారిశుద్ధ్య పనుల నిర్వహణ, మురుగు కాలువల పరిస్థితి, ఇంటింటి చెత్త సేకరణ తీరును పరిశీలించారు. గ్రామంలో పారిశుద్ధ్య పనుల నిర్వహణలో ఎలాంటి లోపాలు లేకుండా సిబ్బంది బాధ్యతగా విధులు నిర్వర్తించాలని ఆయన సూచించారు. ముఖ్యంగా మురుగు కాలువల్లో చెత్త పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని, కాలువల్లో మురుగు నిల్వ ఉండటం వల్ల ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇంటింటి నుంచి చెత్త సేకరణలో సిబ్బంది అలసత్వం ప్రదర్శించరాదని, ప్రతిరోజూ నిర్ణీత విధానం ప్రకారం చెత్తను సేకరించి గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు. పరిసరాల పరిశుభ్రత ప్రజల ఆరోగ్యంపై నేరుగా ప్రభావం చూపుతుందని, ఆరోగ్యకరమైన జీవనానికి శుభ్రత ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా గ్రామస్తులకు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన అవసరంపై అవగాహన కల్పించారు. చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా పంచాయతీ సిబ్బందికి అందజేయాలని సూచించారు. పారిశుద్ధ్య నిర్వహణలో అధికారులు, సిబ్బందికి ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా ప్రధాని మోదీ జన్మదిన వేడుకలు

**మెళియాపుట్టి, సెప్టెంబరు 17 (వార్త):** మెళియాపుట్టిలో భారత ప్రధానిమంత్రి నరేంద్ర మోడీ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. అత్యంత వైభవంగా, పండగ వాతావరణంలో బిజెపి పార్టీ నాయకులు, డాక్టర్ సలాన శరత్ కుమార్ ఆధ్వర్యంలో ముందుగా వేణుగోపాలస్వామి ఆలయంలో గురువారం సాయంత్రం ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. కూటమి పార్టీలకు చెందిన నాయకులు, యువకులు వివిధ గ్రామస్తులు, కార్యకర్తల మధ్య కేక్ కట్ చేసి నరేంద్ర మోడీకి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సలాన శరత్ కుమార్ మాట్లాడుతూ నరేంద్ర మోడీ రెండు పుష్కరాలు కాలంగా ప్రజాసేవలోనే తన జీవితాన్ని దేశ సేవకి అంకితం చేశారని కొనియాడారు. ఈ వేడుకల్లో భాగంగా స్థానిక కూటమి నాయకులు కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని మోడీ గారు నిండు నూరేళ్లు ఆరోగ్యంగా, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. అంతకుముందు దేవాలయ ప్రాంగణంలో దీపారాధన కార్యక్రమాన్ని సైతం నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో బిజెపి పార్టీ నాయకులు డాక్టర్ సలాన శరత్ కుమార్ తోపాటు సలాన రాఘవరావు, కూటమి పార్టీకి చెందిన అనపాన రాజశేఖర్ రెడ్డి, సలాన అప్పలనాయుడు, దుక్క బాలరాజు, రమేష్ చంద్రనాయక్, మాలతి శ్రీధర్, రవిశంకర్, జ్ఞానేశ్వర్ రావ్, చంద్రశేఖర్ చౌదరి, దుక్క శంకర్, కూటమి పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, యువకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



## రైతు బజార్‌కు స్థల పరిశీలన



**సోంపేట, సెప్టెంబరు 17 (వార్త):** సోంపేటలో రైతు బజార్ ఏర్పాటుకు మార్కెట్ కమిటీ అధికారులు గురువారం స్థల పరిశీలన చేపట్టారు. చేపల మార్కెట్ పక్కన ఖాళీగా ఉన్న స్థలంలో రైతు బజార్ ఏర్పాటు చేసేందుకు కొద్ది నెలల క్రితం స్థానిక తాసిల్దార్ తోపాటు మార్కెట్ కమిటీ కార్యదర్శి తదితరులు పరిశీలించిన విషయం తెలిసిందే. అదే స్థలాన్ని గురువారం ఏఎంసీ జిల్లా ఇంజనీరు రామారావు, టెక్నికల్ అసిస్టెంట్ శ్రీనివాసరావు, కంచిలి ఏఎంసి అధికారి రవి తదితరులు పరిశీలించారు. సోంపేట చుట్టుపక్కల గ్రామాల్లో కూరగాయలు సాగు చేసే రైతులు అధికంగా ఉన్నందున సోంపేట పట్టణంలో రైతు బజారు వెంటనే ఏర్పాటు చేసి అటువంటి రైతులందరికీ ప్రయోజనం కల్పించాలన్న ఉద్దేశంతో జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర మహిళా కన్వీనర్ సీపాన గుణవతి తీవ్రంగా ప్రయత్నించారు. పరిశీలన కార్యక్రమంలో గోవిందరాజులు, సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## హైకోర్టు అడ్వకేట్‌గా వాయిలపల్లి దేవి

**- పలాస ప్రాంత నిరుపేద మహిళలకు ఉచిత న్యాయసేవలే లక్ష్యం**

**పలాస, సెప్టెంబరు 17 (వార్త):** పలాస పట్టణానికి చెందిన వాయిలపల్లి దేవి ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో అడ్వకేట్‌గా ప్రమాణ స్వీకారం చేశారు. బార్ కౌన్సిల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆమె అడ్వకేట్‌గా నమోదు పొందారు. ఆమెకు రిజిస్ట్రేషన్ నంబరు 1871 కేటాయించారు. బార్ కౌన్సిల్ కార్యదర్శి బి.పద్మలత, ఛైర్మన్ సీహెచ్.అజయ్‌కుమార్ సమక్షంలో దేవి ప్రమాణ స్వీకారం చేశారు. న్యాయవాద వృత్తిలోకి అడుగుపెట్టిన సందర్భంగా ఆమె మాట్లాడుతూ న్యాయపరమైన అవగాహన, ఆర్థిక స్థోమత లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నిరుపేదలకు అండగా నిలవాలన్నదే తన లక్ష్యమని తెలిపారు. ముఖ్యంగా పలాస ప్రాంతంలోని నిరుపేద మహిళలకు అవసరమైన సందర్భాల్లో ఉచిత న్యాయసేవలు అందించేందుకు కృషి చేస్తానన్నారు. మహిళలు తమ హక్కులపై అవగాహన పెంచుకోవడంతోపాటు, న్యాయపరమైన సమస్యలను ధైర్యంగా ఎదుర్కొనేలా సహకరిస్తానని తెలిపారు. స్థానిక ప్రాంతానికి చెందిన మహిళ హైకోర్టు న్యాయవాదిగా బాధ్యతలు చేపట్టడం పట్ల పలువురు అభినందనలు తెలిపారు.



## పలాసలో 'ఆశీర్వాద్ కా దియా'

**- ప్రధాని మోదీ జన్మదినం సందర్భంగా సేవా సంకల్ప అభియాన్**

**పలాస, సెప్టెంబరు 17 (వార్త):** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని పలాస నియోజకవర్గ ఎమ్మెల్యే గౌతు శిరీష కార్యాలయంలో 'సేవా సంకల్ప అభియాన్--ఆశీర్వాద్ కా దియా' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏఎంసీ చైర్మన్ మల్ల శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు. ఈ సందర్భంగా మోదీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ప్రజాసేవకు ప్రాధాన్యమిస్తూ పేదలు, మహిళలు, యువత, రైతులు తదితర వర్గాల సంక్షేమం కోసం పనిచేయాలని కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు తెలిపారు. దేశ అభివృద్ధి, సంక్షేమం, వివిధ రంగాల్లో పురోగతికి సంబంధించిన అంశాలను ప్రస్తావిస్తూ కార్యక్రమంలో నాయకులు మాట్లాడారు. అనంతరం పార్టీ కూటమికి చెందిన నాయకులు, కార్యకర్తలు కార్యక్రమంలో పాల్గొన్నారు.




Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546